క్లుప్తంగా

నెల్లూరుకు వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందించేందుకు వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్

పొదలకూరు : భర్తను కోల్పోయి, గుండెకు శస్త్ర చికిత్స చేసుకుని నెల్లూరు నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు పింఛన్ డబ్బును వలంటీర్ ఆస్పత్రిలో అందజేశారు. పొదలకూరు గ్రామ సచివాలయం బిట్-3 పరిధిలో పనిచేస్తున్న వలంటీర్ ఆర్.వంశీ గ్రామానికి చెందిన నారాయణమ్మ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. దీంతో మంగళవారం నెల్లూరుకు వచ్చి ఆస్పత్రిలో నారాయణమ్మ వేలిముద్ర సేకరించి పింఛన్ నగదును అందజేశారు. దీంతో ఆమె వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

కంది సాగుకు అనుకూలం

- ఏఓ వాసు



కందిపంటలను పరిశీలిస్తున్న ఆర్బీకే సిబ్బంది

పొదలకూరు: ప్రస్తుత వాతావరణం కందిపంట సాగుకు అనుకూలంగా ఉంటుందని ఏఓ ఎ.వాసు రైతులకు సూచించారు. మండలంలోని బిరదవోలు, కల్యాణపురం గ్రామాల్లో జరుగుతున్న కందిపంట సాగును ఆర్బీకే సిబ్బందితో కలిసి ఏఓ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్‌లో కంది సాగు చేపట్టవచ్చన్నారు. మండలంలో మెట్టపొలాలు అధికంగా ఉన్నందున కందితో పాటు రబీ సీజన్లో మినుము, పచ్చిశనగ, పెసర పంటలు సాగుచేస్తుంటారని, అయితే ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు కంది అనుకూలంగా ఉంటుందని తెలిపారు. కందిని ఏకపంట లేదా అంతర్గత పంటగా సాగు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. మినుము, పెసర, పచ్చిశనగ పంటల్లో అంతర్‌పంటగా కంది సాగుచేస్తే రైతు లాభాల బాటలో పయనించవచ్చని సలహా ఇచ్చారు.

యాచకుడి మృతి



యాచకుడి మృతదేహం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని కాగులపాడు రోడ్డు సమీపంలో ప్రైవేటు లేఅవుట్‌లో యాచకుడు మృతిచెందినట్లు మంగళవారం గుర్తించారు. స్థానికుల కథనం మేరకు.. స్థానికంగా ఉన్న కొందరు రైతులు తమ పొలాలకు నీరు పెట్టుకునేందుకు వెళ్లగా కాలువ పక్కన దుర్వాసన రావడంతో వెళ్లి చూశారు. అక్కడ సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రామారావు, ఎస్సై వీరప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి గ్రామంలో విచారణ చేపట్టారు. అతను యాచకుడిగా స్థానికులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. తీవ్ర ఎండలు, ఆహారం లేని కారణంగా లేఅవుట్‌లోనే స్పృహతప్పి పడిపోయి మృతిచెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు రూరల్: గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దేవరపాళెంలో చోటుచేసుకుంది. నెల్లూరు రూరల్ పోలీసుల వివరాల మేరకు.. ఎగ్గల పెంచలయ్య (45)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇటీవల నొప్పి ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురయ్యారు. దీంతో గడ్డి మందును సేవించారు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన నారాయణ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. రూరల్ పోలీసులు ఘటన స్థలానికి మంగళవారం చేరుకొని విచారణ జరిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

10న డయల్ యువర్ డీఎం

నెల్లూరు సిటీ: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఈ నెల పదిన నిర్వహించనున్నామని నెల్లూరు ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రయాణికులు వారి సలహాలు, సూచనలను తెలియజేయాలని కోరారు. 99592 25611 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అద్వితీయంగా వరిసాగు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వర్షాలు సమృద్ధిగా కురవడం, జలాశయాల్లో సాగునీరు పుష్కలంగా ఉండటంతో మండలంలో రైతులు రెండో పంట సాగుకు సిద్ధమయ్యారు. కొన్ని గ్రామాల్లో నారుమళ్లు పోసుకుని, దుక్కి పనులు చేస్తుండగా, కొన్ని గ్రామాల్లో వరినాట్లు వేసేందుకు రైతులు పనులు పూర్తి చేశారు.

- మూడు వేల ఎకరాల్లో రెండో పంటసాగు
- వ్యవసాయ పనుల్లో బిజీగా రైతన్నలు



గొలగమూడిలో నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న నారుమళ్లు



సర్వేపల్లి కాలువ ద్వారా రిజర్వాయర్‌కు చేరుతున్న నీరు

వెంకటాచలం: మండలంలో సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు కాలువ కింద 50 వేల ఎకరాలకు పైగా తొలి పంట సాగు చేసుకున్న రైతులు మంచి దిగుబడులు సాధించి ఎన్నడూ లేని ధరకు ధాన్యాన్ని అమ్మారు. సోమశిల జలాశయంలో పుష్కలంగా నీరు ఉండటంతో రెండో పంటకు సాగు నీరు ఇచ్చేందుకు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో మండలంలో ఇస్కపాళెం, గొలగమూడి, కనుపూరు, తిక్కవరప్పాడు, కంటేపల్లి, కురిచెర్లపాడు తదితర గ్రామాల రైతులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వద్దకు వెళ్లి చెరువులకు సాగు నీరు అందించాలని కోరారు. దీంతో ఆయా గ్రామాల్లోని చెరువులకు నీరు నింపాలని ఇరిగేషన్ అధికారులను మంత్రి కాకాణి ఆదేశించారు. ఈ మేరకు చెరువులకు సాగునీరు విడుదల చేయడంతో రైతుల నార్లు పోసుకుని, పొలాల్లో దుక్కి పనుల్లో నిమగ్నమయ్యారు. ఇస్కపాళెం గ్రామంలో అత్యధికంగా వెయ్యి ఎకరాల్లో వరిసాగు చేస్తుండగా మిగతా గ్రామాల్లో కలిపి 2 వేల ఎకరాల్లో వరిసాగు పనులు చేస్తున్నారు.

ఆర్బీకేల్లో ఎరువుల పంపిణీ

రెండో పంట సాగు చేస్తున్న గ్రామాల్లో ఎరువుల కోసం రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందుగానే వ్యవసాయశాఖ అధికారులు ఎరువుల నిల్వలపై దృష్టి సారించారు. గ్రామాల వారీగా ఎన్ని ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారో తెలుసుకుని, యూరియా, డీఏపీ తదితర రకాల ఎరువులను నిల్వ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో అవసరం మేరకు యూరియాను నిల్వ చేశారు. సాగునీరు, ఎరువులకు ధోకా లేకపోవడంతో రైతులు సంతోషంగా వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు.



పొలాలకు నీరు పట్టిన రైతులు

రెండో పంటను సాగు చేస్తున్నాం



సోమశిల జలాశయంలో పుష్కలంగా నీరు ఉండటంతో సర్వేపల్లి రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేశారు. దీనివల్ల రెండో పంటను కూడా సాగు చేస్తున్నాం. సాగునీరు విడుదల చేయాలని రైతులంతా కోరిన వెంటనే మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సాగునీరు విడుదల చేయించారు.

– చిట్టమూరు శివకుమార్‌రెడ్డి, రైతు, ఇస్కపాళెం

సాగుకు ధోకా లేదు



రెండో పంట సాగుకు ధోకా లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రిజర్వాయర్ నిండా నీరు నింపడంతో పాటుగా రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల నిల్వలు ఉంచారు. దీని వల్ల సంతోషంగా రెండో పంటను పండించుకుంటున్నాం.

– విజయసేనారెడ్డి, ఇస్కపాళెం

ఎరువుల నిల్వలు ఉంచాం

వెంకటాచలం మండలంలో మూడు వేల ఎకరాల్లో రైతులు రెండో పంటను సాగు చేస్తున్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో ఎంత మేరకు ఎరువులు అవసరమో గుర్తించాం. ఇప్పటికే అన్ని గ్రామాల్లో యూరియా నిల్వలు ఉంచాం. మిగతా ఎరువులు కూడా రైతులకు అందుబాటులో ఉంచుతాం.

– హరి కరుణాకర్‌రెడ్డి, మండల వ్యవసాయశాఖాధికారి

విజ్ఞాన శిబిరాలతో మానసికోల్లాసం



ఆటలాడుతున్న చిన్నారులు

మనుబోలు : వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని మనుబోలు లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ అన్నారు. మనుబోలు గ్రంథాలయ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు క్యారమ్స్, చెస్‌తో పాటు పలు రకాల పోటీలు నిర్వహించారు. పేపర్ క్రాఫ్ట్స్‌పై అవగాహన కల్పించి విద్యార్థులతో పేపర్ బొమ్మలు చేయించారు. యోగా ట్రైనర్ కోటేశ్వరరెడ్డి యోగా క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ విజ్ఞాన శిబిరాలతో విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికి తీసేలా వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పి పడిన ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని కనుపూరు సమీపంలో మంగళవారం జరిగింది. నెల్లూరు నగరం ఖుద్దూస్‌నగర్ ప్రాంతానికి చెందిన ఫయాజ్ పనినిమిత్తం కసుమూరుకు వెళ్తుండగా మలుపురోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో ఫయాజ్ గాయపడగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేకానికి సన్నాహాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన మంత్రి కాకాణి, పక్కన ఆలయ ఈఓ తదితరులు

ముత్తుకూరు : మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో పునర్నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు విగ్రహాల ప్రతిష్ట, మహా కుంభాభిషేకం భారీ ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టారు. వందల ఏళ్ల నాటి శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని పడగొట్టి 2017 నవంబర్ 17న విష్ణాలయం పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఒకే ప్రాంగణంలోనే రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు భారీ విష్ణాలయం నిర్మాణ పనులు చేపట్టారు. ఏడు అంతస్తుల ఎత్తున గాలిగోపురం నిర్మాణం పూర్తి చేశారు. సుమారు రూ.13.5 కోట్ల వ్యయంతో పూర్తిగా గ్రానైట్ రాళ్లతో నిర్మించిన ఆలయంలో సుమారు 22 విగ్రహాలను ప్రతిష్ట చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

వేణుగోపాలస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట, మహా కుంభాభిషేకాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ మేరకు ఈఓ జనార్ధనరెడ్డి మంత్రికి పట్టుశాలువ కప్పి ఆహ్వానించారు. ఉప సర్పంచ్ రాగాల వెంకటేశ్వర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.



పునర్నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయం

రోడ్లు, డ్రెయిన్లకు రూ. 82 లక్షల మంజూరు

పొదలకూరు : పొదలకూరు పంచాయతీ ఒకటో వార్డు పరిధిలో సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్లకు రూ.82 లక్షలను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంజూరు చేయించారు. ఈ పనులను వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు మంగళవారం ప్రారంభించారు. సైడ్‌డ్రెయిన్లకు రూ.56 లక్షలు, అంతర్గత సిమెంటురోడ్లకు రూ.26 లక్షలు మంజూరైనట్లు వార్డుసభ్యుడు ఎస్‌కే అంజాద్ వెల్లడించారు. ఈ పనులను మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నుడా నిధులను కాకాణి మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు జి.శ్రీనివాసులు, నేతలు మూలి సతీష్‌రెడ్డి, మలిశెట్టి శివశంకర్, ఎం.రవికుమార్, కోఆప్షన్ సభ్యుడు దస్తగిరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

బైక్‌ల చోరీ

నెల్లూరు(క్రైమ్): వేర్వేరు ప్రాంతాల్లో రెండు బైక్‌లు చోరీకి గురయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. కనుపర్తిపాడుకు చెందిన సురేంద్ర తన హోండా షైన్ బైక్‌ను అయ్యప్పగుడి ఫ్లయ్‌ఓవర్ వద్ద ఏప్రిల్ తొమ్మిదిన నిలిపి బేల్దారి పనులకెళ్లారు. అనంతరం తిరిగొచ్చేసరికి బైక్ కనిపించలేదు. దీంతో వేదాయపాళెం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు.

- బుజబుజనెల్లూరుకు చెందిన కిషోర్ తన హోండా బైక్‌ను అయ్యప్పగుడి వద్ద మే ఏడున నిలిపి దర్శనానికి వెళ్లారు. అనంతరం వచ్చేసరికి వాహనం కనిపించలేదు. దీంతో వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వీరాంజనేయస్వామికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో అభయాంజనేయస్వామి



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. రెడ్డిజన సేవా సంఘం ఉభయకర్తలుగా వ్యవహరించి ఉదయం దేవస్థానంలో అభిషేకాలు, ఆకుపూజ, అష్టోత్తర పూజలను జరిపించారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారికి పల్లకిసేవ, పూజలు చేశారు. సంఘ యువకులు హనుమాన్ చాలీసాను ఆలపించారు. రంగురంగుల విద్యుద్దీపాలంకరణలతో దేవస్థానం ప్రాంగణాన్ని అలంకరించారు. పాటలు, బాణసంచా, మంగళవాయిద్యాలు, కీలుగుర్రాలు, డీజేతో అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు ముదివర్తిలో ‘గడప గడపకు..’

కోవూరు(విడవలూరు) : మండలంలోని ముదివర్తి గ్రామంలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం బుధవారం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరై ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

మనుబోలు : వడదెబ్బకు గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మనుబోలు అరుంధతీయవాడలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కంటిపల్లి వెంకటేశ్వర్లు(52) సోమవారం కూలి పనులకు వెళ్లాడు. అక్కడ అస్వస్థతకు గురయ్యాడు. తోటి కూలీలు ప్రథమ చికిత్స చేసి ఇంటికి తీసుకొచ్చారు. అయితే రాత్రి మరణించాడు. దీంతో కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

కోవూరు(విడవలూరు) : మండలంలోని రామతీర్థంలో కొలువైన కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రికను మంగళవారం రాత్రి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఈనెల 10వ తేదీ నుంచి 18 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని దేవస్థాన కమిటీ తెలిపింది.

బస్సు ఢీకొని గేదె మృతి

పొదలకూరు : పట్టణానికి సమీపంలో చిట్టేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గ్రామ రైతు రాధారెడ్డికి చెందిన గేదె మంగళవారం ఆర్టీసీ ఆన్‌కాం ట్రాక్ట్ బస్సు ఢీకొని మృతి చెందింది. రైతు ఇటీవలే గేదెను రూ.80 వేలకు కొనుగోలు చేసినట్లు రైతు వాపోయారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

పేదలు బాగుండాలనే పథకాల అమలు



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: రాష్ట్రంలో పేదలంతా బాగుండాలనే లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదుల సంఖ్యలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గండవరంలో ఆయన మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న ప్రతి పథకం ఒక చరిత్ర అని కొనియాడారు. రాష్ట్రంలో పేదలంతా సంతోషంగా ఉన్నారంటే అందుకు దానికి కారణం తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే అన్నారు. అర్హులకు పక్కాగా పథకాలు అందించేందుకు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. గత ప్రభుత్వంలో పథకాలు అందుకోవాలంటే టీడీపీ నేతల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు అవినీతికి తావు లేకుండా అందుతున్నాయని చెప్పారు. ఏ గడపకు వెళ్లినా ఆనందంగా స్వాగతిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో పేదరికం ఉండకూడదన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరిచలపతిరావు, ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ జి.వసంత కుమారి, ఏపీఎం ఎస్.రుక్మిణి, ఎంపీపీ జి.జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు అడపాల మోహన్‌కృష్ణ, అల్లం సత్యం యాదవ్, పెనాక శ్రీనివాసులురెడ్డి, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, ఎస్‌కే ముజీర్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

కోవూరు: ప్రజలకు గ్రామ సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు అందించాలని, తద్వారా ప్రజల మన్ననలు పొందేందుకు వీలు ఉంటుందని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి అన్నారు. మండలంలోని గ్రామ సచివాలయం-1ను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేలా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని తెలిపారు. సచివాలయంలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



సచివాలయాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

రమణీయం.. తెప్పోత్సవం



తెప్పోత్సవంలో విహరిస్తున్న అమ్మవారు (ఇన్‌సెట్లో) చాముండేశ్వరీదేవి



విశేషంగా తరలివచ్చిన భక్తజనం

- అధిక సంఖ్యలో హాజరైన భక్తులు

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చివరిరోజు మంగళవారం రాత్రి తెప్పోత్సవం రమణీయంగా సాగింది. తొలుత చాముండేశ్వరీదేవిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ వెనుక వైపు ఉన్న కోనేరులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్పపై అమ్మవారిని కొలువుదీర్చారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, బాణసంచా, భక్తుల జయజయ నామస్మరణల నడుమ స్వామి, అమ్మవారు కొలనులో విహరించారు. ఉభయకర్తలుగా నావూరు మురళీమనోజ్‌కుమార్, అరుణ వ్యవహరించారు. ఆలయ అర్చకులు నూతలపాటి అనిల్ కుమార్ శర్మ, మాచవోలు రామకృష్ణ, ముప్పిరాల కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో తొలుత అమ్మవారికి పూలంగి సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా హైదరాబాద్‌కు చెందిన పాలగిరి రమేష్– చాముండేశ్వరి, పాలగిరి సందీప్– లాస్య దంపతులు వ్యవహరించారు. స్థానికులు పెనుబల్లి రామచంద్ర నాయుడు, యామిని కృష్ణ దంపతులు భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వేకువజామున అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపవాస ప్రార్థనలతో దీక్ష బూనిన భక్తులు నిప్పుల గుండాన్ని తొక్కి భక్తిని చాటుకున్నారు. అనంతరం ధ్వజా అవరోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంతానం లేని మహిళలకు కొడిముద్దలు పంచిపెట్టారు. విఘ్నేశ్వర యూత్ సభ్యులు భక్తులకు ప్రసాదాలు అందించారు. కోవూరు సీఐ కె.రామకృష్ణారెడ్డి, ఎస్సై వెంకటరాజేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.